# అట్టమీద బొమ్మ

చంకనున్న బుట్ట కిందపెట్టి, కింద పడివున్న కాగితంముక్క తీసుకొని అక్కడే చతికిలబడింది సుబ్బులు. కాగితంలోని అక్షరాలను కూడ గల్పుకొని చదవటానికి ప్రయత్నిస్తూ, అలాగే కూర్చుండిపోయింది. ఎంతసేపు అలా కూర్చుందో ఏమోకాని, ఆ దారినే వెళ్తున్న రాము కేకేసేంతవరకు ఆమె ఈ లోకంలో లేదు.

* * *

సుబ్బులు ఆ చిన్న పల్లెలోనే పుట్టి పెరిగింది; పేదకుటుంబం. ఉన్న నాలుగు కుంటల పొలంలో నడుంవంచి పనిచేసి, ఆ రైతుకు ఈ రైతుకు అపనీ ఈపనీ చేసిపెట్టూ సంసారం గడుపుకొస్తున్నాడు, సుబ్బులు తండ్రి వెంకయ్య. మోతుబరీ రైతులు ఆ పల్లెలో చల్లగా వున్నంతవరకూ అతనికేమంత దిగులు లేదు. కాని అతని దిగులల్లా సుబ్బులు పెళ్ళి.

సుబ్బులు పెళ్లీడుకొచ్చింది. అందానికి తక్కువంటూమా, పల్లెపడుచుల సౌందర్యమంతా ఆమెలో మూర్తీభవించివుంది. పనీపాట విషయానికొ నడుంవంచి ఇంటిపనులే గాకుండా పొలం పనుల్లోగూడా తండ్రికి సాయం చేస్తుంది. కాని వచ్చిన చిక్కల్లా ఈమధ్య సుబ్బులు మారిపోయింది. ఎక్కడ ఏ కాగితంముక్క కన్పించినా దాన్ని తీసుకొని అక్కడే చతికిలపడటం, దాన్ని చూస్తూ తనపని మరచిపోవటం - ఇదీ వరుస.

పెళ్ళీడుకొచ్చిన పిల్ల ఈవిధంగా మారిపోవటం తండ్రి వెంకయ్య మనస్సు తల్లడిల్లింది; తల్లి సత్తి నోరు కొట్టుకుంది, పిచ్చేమోననే అనుమానంతో. చప్పున పెళ్లి చేస్తే పిచ్చి దానంతటదే కుదురుతుందని అయినవాళ్లు నలుగురూ సలహా ఇచ్చారు. ఈ విషయం ఆనోట ఆనోటబడి పల్లంతా పాక్కకముందే, పిల్లకు పెళ్ళిచేయాలనే ఉద్దేశ్యంతో తగిన సంబంధంకోసం వెంకయ్య వెదుకసాగాడు.

* * *

సుబ్బులుకు, గ్రామ పెద్దైన చౌదరిగారి కూతురు పార్వతికి చిన్నప్పటినుండి ప్రాణస్నేహం. ఒకర్నొకరు విడచి ఒక్కక్షణం గూడా వుండేవాళ్లుకాదు. తద్వారా రెండు కుంటుబాలుగూడా ఒకరికొకరు చేదోడు వాదోడయ్యారు. పార్వతి, సుబ్బుల స్నేహాన్ని చూచిన నలుగురూ, "ఇదేంటమ్మా, పెళ్లయితే ఎలా! ఇద్దరూ ఒకణ్నే కట్టుకుంటూరేమిటి!" అని ముక్కు మీద వేలేసుకొని, ముసిముసిగా నవ్వుకునేవాళ్లు. కాని ఏడాది క్రితం పట్నంనుండి ఓ పెద్ద సంబంధం కలిసివస్తే చౌదరిగారు పార్వతికి పెళ్లిచేశాడు. పార్వతి సుబ్బుల్ని విడవలేక విడవలేక విడిచివెళ్లింది అత్తగారింటికి. అయితే సంవత్సరం తిరక్కముందే పురిటికి పుట్టింటికి తిరిగొచ్చింది. సుబ్బులుకు, పార్వతికి మధ్య ఏర్పడిన ఏడాది ఎడబాటు వాళ్లిద్దరినీ మరింత దగ్గరగా చేర్చింది.

అయితే పట్నంనుండి తిరిగొచ్చిన పార్వతికీ, పల్లెలో పుట్టిపెరిగిన పార్వతికీ చాలా తేడావుందని సుబ్బులు గ్రహించటానికి ఎంతో కాలం పట్టలేదు. మునుపటి పార్వతి ఒట్టి అమాయకురాలు; ఎప్పుడూ బొమ్మల

## రామచంద్

పెళ్లిళ్లతోటి, ఆటపాటలతోటి, పాలేల వెంటబడి పిల్లిపెసరకాయలు ఏరటంలో కాలం గడిపిన పల్లెపడుచు. నేటి పార్వతి, అంతా పట్నం వాళ్లపద్ధతిలో కట్టుబొట్టు జుట్టుల్లో ఎప్పుడూ ఏదో పుస్తకాలు తిరగేస్తుండే నాగరికవతి. ఇంతలో పార్వతి అంతగా ఎలా మారిపోయిందా అని సుబ్బులు ఆశ్చర్యపోయింది.


పార్వతి మొగుడు పట్నంలో ఏదో ఉద్యోగం చేస్తున్నాడు. పల్లెనుండి పట్నంలో పార్వతి కాలు పెట్టగానే, ఆమెను తనుండే వాతావరణానికి అనుగుణంగా మార్చే బాధ్యత తనపైనే వున్నదని అతడు గ్రహించాడు. గ్రహించటమేకాదు, ఆమెను లాలించి, ఆమెకు బోధించి అన్నిటిల్లో ఆమెను పూర్తిగా మార్చాడు. తీరిక సమయాల్లో ఆమెకు చదువను వ్రాయను నేర్పాడు. ఇప్పుడామె పుస్తకాలు, పత్రికలు చదువగలదు. తేట తెలుగులో భర్తకు, ముత్యాలవంటి అక్షరాలతో ఉత్తరాలు వ్రాయగలదు.

పెళ్లిసమయంలో సుబ్బులు పార్వతి భర్తను చూసింది. సూట్లు బూట్లతో టిప్‌టాప్‌గా వుండే అటువంటి భర్త దొరకటం పార్వతి ఎంతో అదృష్టవంతురాలనుకుంది. ఆమెపై గౌరవం సుబ్బులులో అధికమైంది.

పురుడు పోసుకొని, పండంటి పాపాయితో పార్వతి అత్తగారింటికి వెళ్లేంతవరకూ సుబ్బులు ఆమెను కాస్తుకొనేవుంది. తీరిక సమయాల్లో పార్వతి సుబ్బులుకు పత్రికల్లోని కథలు, పట్నంలోని వింతలు విశేషాలు చెప్పుతుండేది. రానురాను సుబ్బులుకు, తనూ చదువుకోవాలనే కోర్కె ఉద్భవించింది. ఉద్భవించటం ఆలస్యం, పార్వతి చెవులో చల్లగా వూదింది. పార్వతి ఎంతో సంతోషంతో, సుబ్బులుకు, అంత శ్రమ లేకుండానే అక్షరాలు గుణింతాలు నేర్పింది. అక్షరాలు కూడ కల్పుకొని చదవటంవరకూ వచ్చింది సుబ్బులుచదువు. కాని ఇంతలో పార్వతి అత్తగారింటికి వెళ్ళిపోయింది. ఆనాటినుండి వీథిలో దొరికే కాగితాల్ని ఏరి దాచటం, వాటిని అటు ఇటు తిప్పి ఎంతో కష్టంతో చదవటం—ఆమెకు పరిపాటయింది. విద్యపై ఆమెకున్న అభిలాష వల్లనైతేనేం, అందుకు ఆమె పడుతున్న శ్రమవల్లనైతేనేం, రోజు రోజుకు సుబ్బులులో ఉత్సాహం అధికమవసాగింది. చక్కగా చదవటం అలవాటయింది. కాని చదవటానికి పుస్తకాలు లేవు. తండ్రిని అడిగితే తంతాడేమోనని భయం. తల్లి చీవాట్లు వేస్తుందనే అనుమానం. అందుచేత దొరికిన కాగితమ్ముక్కల్ని చదవటంలో తృప్తిపడసాగింది ఆమె. కాని ఎప్పుడూ పనిపాటల్లో ఉత్సాహంగా వుండే పిల్ల, ఇలా కాగితముక్క లేరి, వాటిని చూస్తూ వేటిని పట్టించుకోకపోవటం ఆమె తల్లితండ్రులకు విచారమే వేసింది. పెళ్ళిచేసి తమ బాధ్యత వదిలించుకోవటానికే నిశ్చయించుకున్నారు.

* * *

నలుగురు రైతులు నాలుగు చేతులు వేసి సుబ్బులు పెళ్లి అయిందనిపించారు. వెంకయ్య తన బరువు తీరిందని ఎంతో సంతోషించాడు. పెళ్ళికొడుకు పక్కనే వున్న పల్లెటూరివాడు. పదహారణాల రైతు. నా అనే వాళ్లెవరూ లేరు. అంతగా లేకపోయినా ఏదో కొద్దిగా వున్నవాడు. సుబ్బులు ఆస్థిపాస్థులు చూసి అతడామెను పెళ్ళి చేసుకోలేదు గాని ఆమె అందచందాల్ని, అణుకువను పనిపాట్లను చూసి పెళ్లిచేసుకున్నాడు. భర్త ఇంట్లో కాలు పెట్టినప్పటి నుండి అన్నివిధాలా అతనికి తోడ్పడుతూ,



జలయంత్రం

ఫోటో: నీలంరాజు [illegible]—మద్రాసు.



# అట్టమీద బొమ్మ

తలలోని నాయికగా మెలగసాగింది సుబ్బులు. ఆమెకు ఇంట్లో ఏ కొరతా లేదు. అత్తమామల పోరు లేదు, ఆడబడుచుల పోరు అంతకంటే లేదు. ఓ ప్రక్క తనను ఆరాధించే భర్త, మరో ప్రక్క ఉండటానికి తగిన ఇల్లు, తినటానికి తిండి అన్నీ సవ్యంగానే వున్నాయి. కాని ఇన్ని వున్నా ఆమెకు ఒకే ఒక లోటు కన్పించసాగింది. తన చదువు, తన చదువు అత్తగారింట్లో అంతమైపోతుందేమోనని భయం. ఎన్నో సార్లు భర్తను అడుగుదామనుకొనేది పుస్తకాలు తెమ్మని. కాని ఆయన ఏమనుకుంటాడో అని నోటివరకు వచ్చిన మాటను దిగమ్రింగేది. అందువల్ల ఆమె చదువు కోమటి కొట్లోనుండి వచ్చే పొట్లాల కాగితాలు భద్రంగా దాచి, భర్త లేని సమయంలో తలుపులన్నీ మూసి దొడ్లో కూర్చుని వాటిని చదవటంతోటే సరిపోయింది. ఆ కాగితాల్లో కొన్ని అర్థమయ్యేవి, కొన్నసలు అర్థమయ్యేవి కావు. ఏవేవో వార్తలు, విశేషాలు, తల తోక లేని కథలు ఎన్నో వుండేవి. వాటిలో ఎలాగైనా పుస్తకాలు సంపాదించి చదవాలి, కనీసం చదువుకున్నా ననిపించాలి, అనే ఆశ ఆమెలో నానాటికీ అధికమవసాగింది. నానాటికీ ఉత్సాహం ప్రబలసాగింది. దినదినానికి ద్విగుణీకృతమౌతున్న ఉత్సాహం ఆమెలో ధైర్యాన్ని రేకెత్తించింది. ఆ ధైర్యంలో ఎలాగైనా భర్తను ఒప్పించి, ఓ పుస్తకం తెప్పించాలనే నిర్ణయానికి వచ్చిందామె. భర్తను అడగటానికి నిశ్చయించుకుంది.


కాని ఆమె తనంతట తానై భర్తను అడగకముందే, అతడే అడిగాడు ఆమెను ఓరోజు. "సుబ్బూ, ఇవాళ బస్తీ వెళ్తున్నా, నీకేమైనా కావాలేమో చెప్పు, తెస్తాను," అని.

సుబ్బులు కొంచెంసేపు తటపటాయించింది. నవ్వుతో ముఖంలో వెన్నెల కురిపిస్తూ, "నేను కావాలన్నది తప్పకుండా తెస్తారా!" అనుమానంగా అడిగింది.

"ఓ, తప్పకుండా. ఏం కావాలేంటో చెప్పు," అన్నాడాతడు, ఆమెను దగ్గరకు తీసుకొని, బుజ్జగిస్తూ.

"ఊహూ చెప్పను," అంది ఆమె కళ్లు మూసుకొని, పెదవులపై చిరునవ్వును చిలికిస్తూ.

"చెప్పవూ, చెప్పకపోతే ఒట్టు" నీలిగింతలు పెడ్తూ అన్నాడాతడు. ఏ నగలో, చీరలో, తినుబండారాలో కోరుకుంటుందనుకుంటూ.



వింతకోణంలో కుతుఃబ్ మినార్

ఫొటో: ఆర్. పి. రంగారావు—సికింద్రాబాదు.

"అయితే చెప్పనా...ఓ పుస్తకం కొనుక్కురండి," ధైర్యాన్నంతా కూడగట్టుకొని అడిగిందామె.

"పుస్తకమా!" కట్టుకోవటానికి చీరో, అలంకరించుకోవటానికి ఏ ఆభరణమో, తినటానికి ఏ తీపిమిఠాయో కావాలని అడగక, పుస్తకం కావాలంటుందేమిటని ఆశ్చర్యపోతూ అన్నాడు.

"ఆ, కథల పుస్తకం..." నీరసంగా అంది ఆమె కళ్లువిప్పి; తీసుకరానంటాడేమో అనే అనుమానంతో.

"నీకు చదువొచ్చా!" అమాయకంగా అడిగాడాతడు, తనకు రానందుకు సిగ్గుపడుతూ.

"ఆ, నా స్నేహితురాలు నేర్పింది," ఏమంటాడో అనుకుంటూ అంది ఆమె.

"మరి ఇన్నిరోజులనుండి చెప్పలేదేం. సరే తెస్తాలే," అని లేచి, కండువా మిత్త

"ఏమయినా సరే, ఇకమీదట నీవే పెత్తనం చేయాలంటే ఎంతమాత్రం వీల్లేదు అని నిన్న సాయంత్రం మా ఆవిడకి చెప్పేశాను".

"భలే. అలా ఉండాలి. ఇక మీదట నువ్వు నలుగురిలో తల ఎత్తుకు తిరగవచ్చును."

"ఇప్పుడే వీల్లేదు. నుదుటి మీద కట్టిన బొప్పె ఇంకా నయంకాలేదు."

వేసుకొని గొడ్లచావిడిలోకి వెళ్లాడాతడు. ఆమె అతడ్ని అనుసరించింది.

ఎడ్లను విప్పి, కుడితిపెట్టి, బండికట్టి బయలుదేరాడాతడు. మట్టిరోడ్డు మలుపు తిరిగేంతవరకు హుషారుగా వెళ్తున్న బండిని చూస్తూ నిలబడిపోయిందామె. ఆ చూపుల్లో ఆశ, అమితఉత్సాహం, ఏదో నిధిలభించబోతున్నదనే సంతోషం మిళితమై, అందమైన ఆమె ముఖంలో ఆనందపు వన్నెలు దిద్దాయి.

*　　*　　*

బస్తీచేరిన సుబ్బులు భర్త తన పనులన్నీ ముగించుకొని, భార్యకు పుస్తకం కొందామని ఓ పుస్తకాల షాపుకు వెళ్లాడు. షాపులో అడుగుబెట్టిన అతడ్ని అదోకలా చూస్తూ, కొట్టులో కుఱ్ఱవాడు ఏంకావాలని అడిగాడు. అద్దపు బీరువాల్లో వున్న పెద్ద పెద్ద పుస్తకాల్ని, లోపల తాడుపై వ్రేలాడుతున్న రకరకాల పుస్తకాల్ని వాటిపైవున్న అందమైన బొమ్మల్ని చూస్తూ, "ఓ పుస్తకం ఇవ్వండి," అని అడిగాడు.

కుఱ్ఱవాడికి నవ్వాగింది కాదు. "పుస్తకం అంటే ఏం పుస్తకం? ఇక్కడెన్నో పుస్తకాలున్నాయి," అన్నాడు వెకిలిగా.

"ఏం పుస్తకమేమిటి, కథల పుస్తకం. ఒకటివ్వండి," అమాయకంగా అడిగాడాతడు, కుఱ్ఱవాడు ఎందుకు నవ్వుతున్నాడో అర్థంగాక.

"కథల పుస్తకమంటే పేరులేదా? రకరకాల కథల పుస్తకాలున్నాయి. పేరు చెప్పితే ఇవ్వగలంగాని నీకేంకావాలో నాకేం తెలుస్తుంది," విసుక్కున్నాడు కుఱ్ఱవాడు; సుబ్బులుభర్తకు కోపంవచ్చింది, కుఱ్ఱవాడిమీదా, ఏ పుస్తకమో చెప్పకుండా పంపిన తన భార్యమీదా.

# ★ అట్టమీద బొమ్మ ★

లోపలఏదో పని చూసుకుంటున్న షాపు యజమాని వాళ్ళ సంభాషణ విని, బయటకు వచ్చాడు; అమాయకుడైన సుబ్బులు భర్తపై జాలి కల్గింది. పొగరుబోతైన కుఱ్ఱవాడిపై కోపం వచ్చిందాతనికి. లోపలికి వెళ్ళమని కుఱ్ఱవాడికి చెప్పి, "ఎవరికి బాబూ పుస్తకం?" అప్యాయతతో అడిగాడు సుబ్బులుభర్తను. చెప్పటానికి మొదట సంకోచించినా, షాపు యజమాని కంఠంలో ఉట్టిపడుతున్న ఆదరంవలన చెప్పక తప్పిందిగాదు, తన భార్యకేనని.

"ఏం చదువుకొంది బాబూ," ప్రేమగా అడిగాడు షాపు యజమాని.

"పెద్దచదువు చదవలేదండి. ఏదో కొద్దిపాటి చదివింది. కథలపుస్తకం కావాలంట," నసుగుతూ జవాబిచ్చాడాతడు.

యజమాని షాపంతా ఒక్కసారి కలియజూసి, దగ్గరలోవున్న బీరువాలోనుండి ఓ పుస్తకం తెచ్చి, "ఇదిగో ఇదీ కథల పుస్తకమే. దీంట్లో అన్నీ కథలే. చాలా బాగుంటాయి. తీసుకెళ్లు. దీనివెల అర్థరూపాయి," అంటూ దాన్నతనికి ఇచ్చాడు. అతడా పుస్తకాన్ని తీసుకొని అటు ఇటు తిప్పి చూశాడు. అట్టమీద బొమ్మ అందంగా వుంది. అతన్నది ఆకర్షించటానికి అట్టేసేపు పట్టలేదు. పక్కజేబులోనుండి అర్థరూపాయి తీసి యజమానికిచ్చి, వెళ్లొస్తా బాబూ అని శెలవుతీసుకొని వెనుదిరిగాడు.

*　　*　　*

ఆ రోజంతా సుబ్బులు పనిచేస్తున్నదన్నమాటేగాని, ఆమె మనస్సంతా భర్త తీసుకురాబోయే పుస్తకంపైనే లగ్నమైంది. ప్రతి నిముషాన్ని ఎంతో కష్టంతో గడుపుతూ, అతని రాకకోసం ఆతృత పడసాగింది. సాయంకాలానికి అతడు రానే వచ్చాడు. వచ్చి, తెచ్చిన సామానంతా ఒక్కొక్కటిగా ఆమె చేతి కిచ్చాడు. కాని పుస్తకం లేదు. తెస్తానని అంతగా చెప్పిన భర్త, ఎందుకు తీసుకురాలేదో ఆమెకు అర్థంకాలేదు. కోపంతో, అవమానంతో ఆమె ముఖం వివర్ణమైంది. మారిన ముఖాన్ని చూచి అతడు నవ్వుతూ, కండువాలోనుండి పుస్తకాన్ని తీసి ఆమె కిచ్చాడు. ఆమె హృదయం ఒక్కసారి ఉప్పొంగిపోయింది. ఒక్కదూకులో సామానంతా ఇంట్లో పెట్టి, అలసిసొలసి వచ్చాడే భర్తకు నీళ్లు తోడి భోజనం వడ్డించాలే అన్న మాటగూడా మరచి, పుస్తకంతో దీపంముందుకూర్చుంది. అట్టమీదవున్న అందమైన బొమ్మను చూస్తూ కొన్ని నిముషాలు అలాగే కూర్చుండిపోయింది. ఆమె ఆనందానికి అంతరాయం కల్గించటం ఎందుకని అతడలాగే గోడకు చేరగిలబడ్డాడు. కాని అంతలో గ్రహించిన ఆమె, మతిమరుపుకు తనను తాను నిందించుకుంటూ లేచి, పుస్తకాన్ని పదిలంగా అలమరలో పెట్టి నీళ్లు తోడటానికి దొడ్లోకి వెళ్ళింది.

*　　*　　*

రోజులు గడిచేకొద్దీ సుబ్బులుకు పుస్తకం తోటిదే లోకమైంది. త్వరత్వరగా ఇంటి పనులు తెమల్చుకోవటం, భర్త వచ్చినప్పుడు ఆయన అవసరాలేమో చూడటం తదితర సమయాల్లో పుస్తకంముందు కూర్చోవటం ఆమెకు పరిపాటయింది. ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదుసార్లు గాదు ఎన్నోసార్లు చదివిన కథనే చదివింది. మొదట కథలంతగా ఆమెకు అర్థంకాలేదు. తర్వాత తర్వాత క్రమక్రమంగా అర్థమవసాగినవి. అర్థమయ్యేకొద్దీ ఆ కథలు ఆమె జీవితంపై సమస్యలు రేపాయి. తను, తన ఇల్లు, తన భర్త, ఆ పల్లె...అంతా ఏదో నరకంలా కనపడింది. తనను పార్వతితోనూ, తన భర్తను పార్వతి భర్తతోనూ పోల్చుకొంది. తనెక్కడ, వాళ్లెక్కడ!...కథల్లోని నాయకుడు, నాయకి ఆమెలో ఓ మహావిప్లవాన్ని లేవదీశారు. వాళ్ళంతా చదువుకున్నవాళ్లు, నవనాగరికులు. తన భర్త చదువులేనివాడు. పొలం పనుల్లో ఎల్లప్పుడూ సతమతమయ్యే అనాకారి. పగలంతా పొలంపని, రాత్రంతా నిద్ర ఇదీ అతని దినచర్య తనకాపురంలో సుఖం లేదన్నట్లు ఆమెకు అనుమానం వేయసాగింది.

పార్వతి నిజంగా ఎంతో అదృష్టవంతురాలు, నవనాగరికుడైన భర్త, పట్నంలో హాయియైన జీవితం.. తను ఆ అదృష్టానికి నోచుకోలేదు...ఏమిటో తెలియని వెలితి ఆమెను వేధించసాగింది. పోనుపోను ఆమె ఆలోచనలు అధికమవసాగాయి. కథల్లోని జీవితాలు ఎంత కమ్మగా వున్నాయి. ఆ నాయకుడు నాయకితో తన ప్రేమను ఏవిధంగా చెప్పాడు!—తన భర్త ఏనాడైనా తనతో ఆవిధంగా మాట్లాడాడా!... తన భర్త ఉత్తి పల్లెటూరి వాడు.. అతనికేమీ తెలియదు...అతడు చదువురానివాడు...

భర్త విషయంలో ఆమె శ్రద్ధ మందగించింది. ఒకటి రెండు సార్లు భర్త విసుక్కున్నాడు. కాని ఆమె ఒంట్లో బాగుండలేదేమో అనుకొని ఎందుకు విసుక్కున్నానా అని నొచ్చుకున్నాడు. దినాలు గడిచే కొద్దీ సుబ్బులులో రేగిన

విప్లవం తీవ్రరూపాన్ని ధరించసాగింది. ఆ భర్తతో సంసారం చేయటం ఆమెకు కష్టమని తోచింది. కాని ఆ భర్తను కాదని తనేమవాలి, అనే ప్రశ్న మాత్రం జవాబు లేకుండానే మిగిలిపోయింది.

* * *

ఆరోజు భోజనం చేస్తూ భర్త అడిగాడు, "ఏమే సుబ్బూ, అదోకలా వుంటున్నావు. ఒంట్లో బాగుంటం లేదంటే," అని.

ఆమె మాట్లాడకుండా అతనికి మజ్జిగ వడ్డించింది.

"మాట్లాడవేమే, ఉలుకూ పలుకూ లేకుండా ఊరుకున్నావ్! మీ ఇంటికి వెళ్లాలని వుందా చెప్పు, వెళ్లొద్దువుగాని," ముద్దమింగుతూ అన్నాడాతడు.

ఆమె అతనివైపు ఆశగా చూసింది; కొంతకాలం అతనినుండి దూరంగా వుంటే బాగుంటుందేమో నని.

"పాపం దిగులుపడ్డావేంటే, పుట్టింట్లోళ్లను చూడాలని. ఇంతమాత్రానికే బెంబేలు పడాలా. పదా, రేపు మంచిది చూసి దిగబెట్టివస్తా," అంటూ లేచి చేయి కడుక్కొని లోపలికి వెళ్లాడు.

అన్నంతిని, ఇల్లంతా సర్ది, తలుపులన్నీ మూసి పడకగదిలోకి వెళ్లింది సుబ్బులు. ఆ రోజంతా మట్టిపనుల్లో మునిగివుండటంవలన భర్త గురకలు పెట్టూ నిద్రపోతున్నాడు.

దీపపు కాంతిలో అమాయకమైన అతని ముఖం, విశాలమైన వక్షం, మెలితిరిగిన కండలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. నుదుటిపైన చెమట బిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి. అన్నిరోజులనుండి ఆమె లోలోపల రేగుతున్న దుమారం ఒక్కసారి పటాపంచలైంది అతని నవ్వుముఖం చూడగానే.

"అతడు నీవాడు...నీభర్త...నిన్నెంతగా ప్రేమిస్తున్నాడో గ్రహించావా! నీ సుఖాన్ని అతడెంతగా కాంక్షిస్తున్నాడో అర్థం చేసుకున్నావా? ఆ కథలు గాథలు నీబోటివాళ్ళకు కాదు...అవన్నీ పైపై మెరుగులు. ఆ మెరుగులకు లోబడి నిన్ను నీవు మరచిపోవటం నీ నాశనానికే కారణమౌతుంది .." ఎవరో బోధ చేస్తున్నట్లు ఆమెకు అన్పించింది.

"ఈ చదువు సంధ్యలు నీకొద్దు. నీ ఇల్లు వాకిలి చూసుకో. నీవు చదివి చేయబోయేదేమీ లేకపోగా, అర్థంలేని వ్యథలో కుళ్ళి కృశించాల్సిందే. ఎంతో ఆదరంతో, అనురాగంతో నిన్ను ఆదరించి, పువ్వుల్లో పెట్టి పూజించే అమాయకుడైన నీ భర్త హృదయంలో స్థానం కోల్పోతావు జాగ్రత్త," ఆమెలోనుండి అంతరాత్మ హెచ్చరించింది. ఆమె కళ్లు అశ్రుపూరితాలయినవి. పశ్చాత్తాపంతో ఆమె హృదయం పరితపించింది. ఎవరో తనచేతిని పట్టుకొని ముందుకు లాగుతున్నట్లు, గబగబ అలమరు దగ్గరకు వెళ్ళి తనలో రేగిన మహా విప్లవానికి కారణమైన పుస్తకాన్ని తీసింది. పైనున్న బొమ్మను ఒక్కసారి తీక్షణంగాచూసి, అట్టను చింపి అవతల పారేసింది. పుస్తకంలోని కాగితాల్ని ముక్కలు ముక్కలుగా చింపి, దీపానికి అంటించి కాల్చివేసి, పడకటింట్లోకి వెళ్ళింది. సుఖమంతా తనదే అన్నట్లు భర్త మైమరచి నిద్రిస్తున్నాడు. జరిగిన దానికి ఓ వేడినిట్టూర్పు వదలి, ఏమీ జరగలేదన్నట్లు మనస్సును నిర్మలం చేసుకొని అతని పక్కనే పడుకొని నిదురపోయింది.

* * *

పొలానికి వెళ్లవలసిన పనుండటంవలన, సుబ్బులుభర్త కోడి కూయకముందే లేచాడు. రోజూ తనకంటేముందు లేచే భార్య ఆనాడు ఇంకా నిదురపోతుండటం వలన మొదట ఆశ్చర్యపడినా, రాత్రి ఆలస్యంగా పడుకుందేమోననుకుంటూ పెద్దగా ఆవులించి, దీపం తీసుకొని బయటకువెళ్లాడు. గుమ్మం ప్రక్కన కాగితాలు కాల్చిన బూడిద పడివుంది. దూరంగా తను తెచ్చిన పుస్తకంమీది అట్ట పారేసివుంది. అట్టను తీసుకొని దానిమీది బొమ్మను పరీక్షగా చూశాడు. అట్టమీది బొమ్మ తనను చూసి నవ్వినట్లనిపించి, తనూ నవ్వాడు. కాని దానికే మాటలు వచ్చివుంటే...! ★

(ఓ మరారీ కథ చదివిన తర్వాత)

TP. 538

ఎంతో రుచికరమైనది, ఎంతో ఆరోగ్యకరమైనది

పకావ్ ఆరోగ్యము నిచ్చును: పకావ్ రుచికరమైనది—మీ భోజన పదార్థములు మంచి వంటకు వాడే సాధనతో తయారుచేయాలనుటకు అనేక కారణాల్లో యివి రెండు. ప్రభుత్వ నిర్ణీతములకు తగినట్టుగా, ఆరోగ్య రక్షక పద్ధతులతో, ఎ.డి విటమినులు కలిపి తయారగు మిక్కిలి శుద్ధత పొందిన పకావ్, పిల్లలకు పెద్దలకు ఎంతో అవసరమైన శక్తిని యిచ్చి వారి ఆరోగ్యమును సంరక్షిస్తుంది; ప్రతి వంటను విందుగా మార్చుతుంది.

పరసమైన ధరలకు 2, 10, 38 పౌన్ల డబ్బాలలో దొరకును.



# పకావ్

ఎ.డి విటమిన్లు కలిగినది

టాటా తయారు

A TATA PRODUCT

భారతదేశపు పెట్టుబడితో.

భారత నిర్వహణ క్రింద.

భారతదేశములో తయారవుతున్నది.

